


# 7 సేవాంతకుడి కథ

'సామీ, సామీ, ఇద్దూరం జూశా విద్దూరం జూశా. మీరిప్పుడా కతనిప్పి జెప్పాలి' అంటూ గోప కుమారుడు ఒక్క పరుగున వచ్చి సంభారాలు కింద పడేసి చతికిలపడ్డాడు. (అంటూ కథ అరంభించాడు రామిరెడ్డిగారు)

మణిసిద్ధుడు జపమాల తిప్పడం ఆపి కళ్లు తెరిచి, "ఇప్పుడు కాదు నాయనా" అన్నాడు. గోపన్న బుంగమూతి పెట్టి "అటయితే నే వెల్తా సావీ. నీ కావుడి నివ్వే మోసుకో" అంటూ లేచాడు.

'వత్సా గోపా! ప్రాణాంతకా! చెప్పు, చెప్పు విద్దూరవేవిటో –' అన్నాడు మణిసిద్ధుడు, కోపాన్ని పళ్ళ మధ్య పెట్టి పటపట కొరికి నవిలేసి.

"ఊళ్ళో ఓ దేవాలయం ఉంది సావీ అదేమో –"

మణిసిద్ధుడు కన్నులు మూసుకుని, మణి ప్రభావంతో ఆ దేవళం కథను దర్శించాడు క్షణమాత్రంలో.

అది చాలా వింతగా కనపడింది. సమకాలిక సమాజంలో సత్యవాదిలా, స్వార్థహీనుడిలా విద్దూరంగా ఉంది. స్వార్థపరుడి ఔదార్యంలా చాలా పొట్టిగాను దర్జాగాను ఉంది. గోడలు మట్టి గోడలయినా కొత్తవయినందువల్ల ఐక్యత కోసమని, కయ్ కయ్ మన్న వారందరికీ చోటిచ్చి భారీగా కట్టిన మంత్రివర్గంలా – దృఢంగానే కనిపిస్తున్నాయి. ఆ గోడలలో కలబోసిన ఇటుక బెడ్డలు, కంకర రాళ్ళు, ప్రాచీన బంగాళా పెంకుముక్కలూ, ఏకగ్రీవ తీర్మానంలో అభిప్రాయ భేదాలలా లీలగా మెరుస్తున్నాయి. ఆలయ నిర్మాతలు తమ కృషిని చూసి సగర్వంగా తలపైకెత్తి రొమ్ము విరుచుకోవడం అట్టే గిట్టని వారయినందువల్ల ఆలయానికి గోపురం కట్టలేదు. కనీసం డాబా వరస కూడా ఏర్పాటు చేయలేదు. అవకాశవాదుల అభిప్రాయాలలా అవసరం వస్తే ఇట్టే ఎగిరి తిరగబడేందుకు వీలుగా పల్చటి రేకులతో రకరకాల వాటితో పైకప్పు వేయించారు. పోతే ఏదో చేసిన పాపం చెబితే పోతుందన్నట్టు ఈ పుణ్యకార్య నిర్వహణలో ఎవరి బాధ్యత ఎంతో, వినమ్రతతో ముక్తసరిగా పేర్కొంటూ శంకుస్థాపన ఫలకం చెక్కించారు. అది ముందువేపు అమర్చారు. నేలమట్టానికి రెండున్నర అడుగుల ఎత్తున పన్నెండడుగుల బారుగా ఉన్న ఆ ఫలకంపై కార్యకర్తల, సహాయకుల, కంట్రాక్టర్ల పేర్లు, ప్రారంభోత్సవానికి వచ్చిన ముఖ్యాముఖ్య మంత్రుల పేర్లు, అది ఒకానొక భక్తుడి విరాళ ఫలితం అయిన వయినం చెక్కించారు.

ఆలయ ప్రాంతం అంతా మహా సంరంభంగా ఉంది. జనం కిక్కిరిసి ఉన్నారు. పెద్దా చిన్నా అంతా సింహ (పుపిల్ల) ద్వారం దగ్గర మోకరిల్లి ముందుకు వంగి పాకుతూ లోపలికి వెళ్ళి పూజచేసి తిరిగి పాకుతూ ఇవతలికి వస్తున్నారు. ఒళ్ళొంగని వారికీ, ఓపిక లేనివారికీ, నడ్డినొప్పి గలవారికీ చక్రాలమర్చిన బళ్ళు - నేలకు ఆరంగుళాల ఎత్తుగలవి అద్దెకిస్తున్నారు. అనధికార ప్రముఖులకు దేవస్థానం వారు ఉచితంగా ఇచ్చి ధన్యులవుతున్నారు. వారంతా ఆ బళ్ళమీద పడుకుంటే, కొందరు వాటిని నెమ్మదిగా లోపలికి నెడుతున్నారు. పూజలయ్యాక, తిరిగి పగ్గాలు వేసి ఇవతలికి లాగుతున్నారు. గోత్రాలు, పేర్లు స్వయంగా చెప్పుకుందుకుగాని, మోకరిల్లడానికి గాని, బళ్ళమీద పడుకుందుకుగాని ఒప్పని వి.ఐ.పి. లకోసం ఒక పక్కగా నిలువు లోతున సొరంగం తవ్వి గచ్చుచేశారు. అందులోంచి నడిచి వెళ్తే సరిగ్గా దేవతలకు ఎదురుగా భక్తుడి తల నిలుస్తుంది. ఆలయం చుట్టూరా వర్తక వ్యాపారాలు ముమ్మరంగా సాగుతున్నాయి. హోటళ్ళు, స్థల పురాణ పుస్తకశాలలు, ప్రసాద విక్రయశాలలు, రంగులరాట్నాలు, బట్టల కొట్లు, టెంటు బయస్కోపు, లాటరీ షాపులు పట్టపగ్గాలు లేకుండా ఉన్నాయి. గుడి చుట్టూరా జనం నిలబడి టాపు మీద రాసి ఉన్న దేవళం పేరును చదువుకుని ముచ్చట పడుతున్నారు. 'మీరంతా భగవంతుడిని కుబ్జుడిని చేశారు.' అన్నాడొక కవి - జనాంతికంగా. అంతలోనే చుట్టూ చూసి నాలుక్కరుచుకొని తలవంచుకొని జనంలో కలిసి మాయమైపోయాడు.

ఈ సన్నివేశాన్ని దివ్యదృష్టితో దర్శించి మణిసిద్ధుడు నిట్టూర్చాడు. గోచిపాత రాయుడైనందువల్ల చేత్తోనే కళ్ళు ఒత్తుకున్నాడు.

"నాయనా, ఈ దేవళం కథ నీకీ వయసులో బోధపడదేమో ఇంకేదన్నా చెబుతాను" అన్నాడు.

గోపన్న పట్టు వదలలేదు.

"సరే విను. అనగనగా ఒక క్షేత్రం. చక్కని భూమి. పక్కని నది. అక్కడ ఒకాయన విడిపి సేద్యం ఆరంభించాడు. పిల్లా మేకా పెరిగింది; ఎదిగింది. ఇల్లు చాలక మరి నాలుగు పాకలు వేసి ఐదు కాపరాలు చేశాడు. కొన్నాళ్లకు ఐదు పదీ పది పాతికా అయ్యాయి. చిన్న ఊరు లాటిది వెలిసింది. ఊళ్ళో దారివేసుకుందుకూ, మందూ మాకూ తెచ్చుకుందుకూ, దానికీ దీనికీ పెట్టుబడి కావల్సి వచ్చింది. మనవంతా అన్నదమ్ములమే కదా, కాపరానికో బస్తాగింజల చొప్పున తలాకాస్త వేదాం" అన్నాడొకడు. "నీకన్నా నా పంట ఎక్కువ. నువ్వు బస్తా ఇచ్చి నేనూ అంతే ఇస్తే ఎలా? నేను రెండు బస్తాలిస్తాను" అన్నాడు మరొకడు. ఇలా ఎవరి తాహతును బట్టి వాళ్ళు సమిష్టి పనులకు కావలసినదే విరాళాలు వేసుకున్నారు. ఇదే రివాజయింది. ఒకసారి నాలుగు బస్తాలిస్తానన్నాయన మూడే ఇచ్చి ఇంకొకటి తరువాత పంపుతానని మరిచిపోయాడు. మరొకాయన రెండుసార్లు నాగాలు పెట్టి బకాయి సర్దలేక, పైసారికి చూసుకుందామన్నాడు. ఈ పద్ధతి బాగులేదనీ నలుగురికీ జ్ఞాపకంచేసి, విరాళాలు పోగుచేసే పని ఎవరికేనా అప్పజెబితే బాగుంటుందనీ తోచి, కొంచెం వయసు మళ్ళిన పెద్దాయనకు - పొలం పనులు చెయ్యలేక రామాకృష్ణా అంటూ కూర్చున్న వాడిని బతిమాలుకున్నారు. కొన్నాళ్ళు ఆ పని చక్కగా చేసి ఆయన పోయాడు; తరువాత ఆ పని ఎవరు చెయ్యాలీ అని ప్రశ్న వచ్చింది.

ఇద్దరు వృద్ధులున్నారు, కొందరు - వీరిని బతిమాలుదామన్నారు. కొందరు వారిని బతిమాలు దామన్నారు. ఏదో ఎక్కువమంది అభిప్రాయాన్ని బట్టి అంతా ఓదారి కొచ్చి ఒకరిని ఎన్నుకున్నారు, మరోసారి పెద్దరికానికి యోగ్యులు నలుగురైదుగురు కనిపించారు. "పోనీ అందరినీ ఉంచుదాం. అంతా కలిసి ఆలోచించి చేస్తా" రన్నారు. కొంతకాలానికి పాతిక ముప్పయి మంది పెద్దలొచ్చారు. ఈసారి జనాభా అంతానో కొందరో ఒక పెద్దగారి పేరు చెప్పడం బదులు వాళ్ళే నేనంటే నేనన్నారు. రచ్చకెక్కి ఇంటింటికీ వెళ్ళి "దేశసేవ నా చేత చేయించంటే నాచేత చేయించు" అని బతిమిలాడటం మొదలెట్టారు. దరిమిలాను ఆశజూపడం మొదలెట్టారు.

నాయనా గోపా! ఇదంతా అనగనగా ఒకనాటి కథ. ఈ దేవళం అసలు కథ ఇటీవల ఎల్లక్షను దగ్గర ఆరంభం అవుతుంది. ఇక్కడ కిందటేడు ముఖ్య సేవకుడు పంతులుగారని ఒకాయన. బాగా డబ్బుంది. దేశసేవ ఛైర్మను కుర్చీలో కూర్చునే చెయ్యక్కరలేదని ఆయనకూ తెలుసు. అయినా ఆ తీర్థానికదో శంఖం అయిపోయింది. కోటినదులు ధనుష్కోటి లోనుండగా ఏటికి తిరగడమేం అనుకుంటూనే యాత్రలు చేసే కాలం ఇది. జనం కూడా "అక్కడ కూర్చుని" వాళ్ళ డబ్బును ఖర్చు పెట్టించిన వాడినే ఎక్కువ పొగుడుతున్నారు. పంతులుగారంటే ఊరందరికీ గౌరవం. అయితే పార్టీలో శాస్త్రిగారికీ, రెడ్డిగారికీ కూడా ఉన్నాయి ఆపాటి పేరు ప్రతిష్ఠలు.

"ఈసారి దేశసేవ మీరు చేదురుగాని" అన్నాడు రెడ్డిగారు శాస్త్రితో, ఆపై యేటికీ తను చేస్తానన్న ధ్వని జోడించి. ఏడాది రెండేళ్ళలో ఊళ్ళో చాలా హడావుడి జరగబోతూంది. ప్రాజెక్టులు పరిశ్రమలు కాలేజీ గట్రా చాలా రాబోతున్నాయి. ఆ వేళకు ఛైరుమీదున్న వాడిదే దశ. వాడిదే సిరి.

శాస్త్రిగారూ, రెడ్డిగారూ ఓ మారు పంతులుగారిని కూర్చోబెట్టి మెల్లగా ఈ కబురు చెప్పి విషయం కదలేసి ఆయన విశ్రాంతి తీసుకోవడం అవసరమన్నారు. పంతులుగారికి మనసు చివుక్కుమంది. ఒకరకంగా భయం వేసింది. తను ఛైర్మన్ కాకపోతే పోయే గాని శాస్త్రి అవడం మాత్రం తగదు అని తోచింది. నవ్వి, చూద్దాంలే అన్నారు.

వారంరోజులపాటు ఆయన చాలా జాగ్రత్తగా ఆలోచించారు. శాస్త్రి వెనక్కు తగ్గేట్టు లేదు. అతను ఆలోచించుకునే రంగంలోకి దిగుతాడు. అతను మంచివాడు కాదని తను ప్రజలకు చెప్పడం సబబు కాదు. చెప్పినా నమ్మరు. పైగా చెబితే ఉత్తర క్షణంలో తను బజార్నపడ్డవాడూ, చెడ్డవాడూ అవుతాడు. ఊళ్ళో ఒక వంక నుంచి అప్పుడే శాస్త్రి వర్గం కాన్వాసింగు ఆరంభించింది. పార్టీలో కొందరు, వాళ్ళతో ఎన్నడూ లేనంత సరదాగా మాట్లాడుతున్నారు. పంతులుగారికి ఈ వరస నచ్చలేదు. ఎల్లక్షను దగ్గర పడుతున్న రోజులు కాబట్టి ఎవడికీ మనసిచ్చి మాట్లాడేందుకు వీల్లేదు. ఎవణ్ణీ నమ్మేందుకు వీల్లేదు. ఎవరినైనా చేరదీద్దామన్నా కూడా పరిస్థితులు అనుకూలంగా కనపడలేదు. శాస్త్రి టౌను పార్టీ సెక్రటరీ. అంతా వాడి చుట్టూరానే తిరుగుతున్నారు. వాడి మీదే మోజు చూపుతున్నారు.

పంతులుగారి కింట్లో కూడా నా అన్నవారు లేరు. భార్య ఏడాది క్రితం హరీమంది. ఎవరో చుట్టరికం కలుపుకున్నవాళ్ళు ఇంత వండి పడేసి తిని పెడుతున్నారు.

ఎదురుతిరిగిన దిద్దరు ముగ్గురే అయినా ఊరంతా తన మీద కుట్ర పన్నుతున్నట్టయిన దాయన ప్రాణానికి. ఆ బాధ వెళ్ళబోసుకుందుకు మరొక ప్రాణం దొరక్క దుఃఖం వచ్చేసింది. రెండుమూడుసార్లు అలా ఆలోచనలోపడి కొట్టుకుపోతూండగా కళ్లు చెమ్మగిల్లాయి. అది చూచినవారు, పంతులుగారికి వయసయి పోయిందన్నారు. "వళ్లు వశం తప్పుతూంది పాప"మని పట్లీకున జాలిపడ్డారు. కుర్చీ దిగి వెళ్తూంటే చెయ్యాసరా ఇచ్చేందుకు కూడా సాహసించారు. ఒకటి రెండు దఫాలు ఆయన మండిపడి చెయ్యి విసిరికొట్టాడు. "వారికి బక్కకోపం కూడా వచ్చేసింది. పాపం" అన్నారు అవతలివాళ్ళు. హఠాత్తుగా రెండు రోజుల నుంచి పార్టీ వర్గాలలో సంచలనం రేగి పెరిగింది. చర్చలు తెగ సాగుతున్నట్లు కనబడింది. సంగతేమిటో ఎవరూ చెప్పరు. మూడోనాడు మీటింగు వేశారు. అధ్యక్షుడితోపాటు పంతులుగారి మెళ్ళో కూడా పూలమాల వేశారు.

పంతులుగారికి కథ బోధపడలేదు. ఆయనకూ లౌక్యం, రాజకీయ లౌక్యం తెలుసుగానీ, అందులో తాను నిధి కాడని అనుమానం. పగవాడు పట్లీకున ఎదిరిస్తే, పోట్లాడడం చేతనవునుగాని, చాపకింద నీరులా వచ్చేస్తే, స్నేహంగా ఉంటూనే గోతులు తీస్తే ఎలా ఎదుర్కోవాలో ఆయనకు తెలీదు. చేతగానితనం వల్ల మరింత ఉక్రోషం కలిగింది.

శాస్త్రిగారు లేచి, అసలు విషయం వెల్లడించారు. రాష్ట్ర పార్టీలో వ్యవహారాలు సవ్యంగా లేవు. సమర్థుడు, వివేకం కలవాడు, అనుభవశాలి అయిన వ్యక్తి కార్యదర్శి హోదాలో నాయకుడిగా కావాలి. పై నుంచి ఆ కబురు వచ్చింది. తమ పంతులుగారి పేరు సూచిస్తూ పైకి రాశాడు. పైవారంతా ఎగిరి గంతేసి ఒప్పుకున్నారు. ఓహో అన్నారు.

"మా అందరికీ తండ్రి వంటివారు. మీరు ఆ గొప్ప పదవి నిర్వహించడం మాకూ, మన ఊరుకూ గౌరవం. అక్కడకు వెళ్ళినా, మీ మనసు ఇక్కడే ఉంటుందనీ, ఈ ఊరు మేలుకోరుతూ ప్రభుత్వంతో పోరాడి, అక్కడ ఉండి చేయగలిగినంతా చేస్తారని మా అందరికీ పరిపూర్ణ విశ్వాసం ఉంది" అన్నాడు శాస్త్రిగారు. అంతా హర్షధ్వానాలు చేశారు. కరతాళ ధ్వనులు చేశారు.

పంతులుగారి తల గిర్రున తిరిగిపోయింది. చెవులు బయట హర్షధ్వానాలకేకాక లోపల్నించి హోరెత్తాయి. గుండె జల్లుమంది. ప్రాణం సొమ్మసిల్లిపోయింది. ఆయన కోలుకునేసరికి, ఆయన్ను కార్యదర్శి పదవి స్వీకరించగోరుతూ సభవారు ఏకగ్రీవంగా తీర్మానం చేసి కింద సంతకాలు పెట్టేశారు.

"నా అనుమతి తీసుకోరా ఏమిటి?" అన్నాడు పంతులుగారు నీరసంగా.

"అడిగితే మీరు ఒప్పుకోరని మాకు తెలుసు. మీకు పదవుల మీద, పేరు మీద ఆశ లేదు. మమ్మల్నెవర్నో వెళ్ళమంటారు కాని మీ వంటి పెద్దలను గౌరవించడం మా కనీస ధర్మం. దీనికి అనుమతులూ, పర్మిషనులూ అక్కరలేదు" అన్నాడు శాస్త్రిగారు – ఇటు నమ్రత, అటు చనువు కొద్దీ పుచ్చుకున్న స్వతంత్రం ఉట్టి పడేలా అంతా. చప్పట్లు కొట్టారు. నలుగురైదుగురు సభ్యులు వరసగా అభినందన ప్రసంగాలు చేశారు. పంతులుగారు ఒక్క నిమిషంపాటు అందరి ముఖాలూ పరీక్షగా చూశాడు.

తనకి ఆట కట్టు చేశారు. పైకి నెట్టేస్తున్నారు. అయిపోయింది కాబోసు. పంతులుగారు తలవంచుకున్నారు. సంతాపసభలో శ్రోతలా విచారంగా తలవంచుక్కూర్చున్నారు.

ఆ సాయంకాలం పంతులుగారు వంతెన వేపు షికారెళ్ళాడు. అప్పొజిషన్ పార్టీ పెద్ద అటే వస్తాడని అయనకు తెలుసు. కలుసుకోగానే ఆయన లాంఛనంగా అభినందించాడు. పంతులుగారికి దుఃఖం ఆగలేదు. కోపం రూపంలో కట్టలు తెంచుకుంది. తన బాధ, చివరికి పరాయి పార్టీవాడి దగ్గర వెళ్ళబోసుకోవలసి వచ్చిందని కూడా తోచలేదు.

"మీరూ రెండేళ్ళ క్రితం ప్రభుత్వం నడిపినవారే. లోతుపాతులూ బరువు బాధ్యతలూ మీకు తెలుసు. మీరు చెప్పండి. శాస్త్రి అవన్నీ సవ్యంగా చేస్తాడా?...చెయ్యగలడా? పోనీ నేనిక్కడుండి కనిపెట్టి చూదామంటే అందుకూ వీల్లేకుండా ఇలా చేశాడు?" అనేశాడు.

"ఫరవాలేదు. నేనుంటానుగా? విశేషాలు రాస్తాలెండి?" అన్నాడు ఎదటి పెద్దమనిషి.

సెలవు తీసుకుంటూ ఆయనే ఇంకో మాట అన్నాడు. "మీవాళ్ళ ధోరణి చూడగా అసలు ఛైర్మనుగిరీ, మెజారిటీ అన్నీ శాశ్వతంగా మీకే వస్తాయన్న ధీమా కనిపిస్తుంది. వరస ప్రకారం పంచేసుకుందామని చూస్తున్నారు. మిమ్మల్ని వెళ్ళగొడితే తను ఖచ్చితంగా ఎలక్షనైపోతాడని ఏవిటి గారంటీ? ఏం నేనెందుక్కాకూడదూ?" అని నవ్వాడు.

పంతులుగారికి మనస్సు కొంచెం తేటపడింది. "మీరు అటేపొస్తే ముందుగా నాకు జాబు రాయండి. నా బసలోనే దిగచ్చు. పార్టీలు వేరైనా నా స్నేహం స్నేహమే" అన్నారు ఆప్యాయంగా.

ఇంటికి తిరిగి వస్తూండగా సుబ్బయ్యగారు కనబడ్డారు. అయన్ను డిటోరావం టారంతా. గ్లాసులో నీళ్లులా కనిపిస్తాడు. కాని కాడేమో? ప్రస్తుతం శాస్త్రిగారి బాండు మేళంలో ఉన్నాడు. పంతులుగారు ఏనాడూ అతన్ని చేరదీయలేదు, చిరాకు.

పరాకులో పలకరించారు ఎదురవగానే. డిటోరావు పొంగిపోయాడు ఆ భాగ్యానికే.

"లక్ష రూపాయల పైచిలుకు బడ్జెట్టు మీద నిర్వాకం చెయ్యడం మజాకా కాదు" అన్నారు పంతులుగారు అదీ ఇదీ మాట్లాడి.

"కాదండీ మరీ! అసలు అందాకా ఎందుకు? పదివేల మీద నిర్వాకం చేసేసరికి రంగులు బయటపడిపోవూ?" అన్నాడు డిటోరావు.

ముఖస్తుతిపరులు చాలా గడుసువాళ్ళు. ప్రతి మాటకూ రెండర్థాలుంటాయి. ఇది శాస్త్రిగారి మీద నింద కావచ్చు. పంతులుగారి మీద వ్యంగ్యం కావచ్చు.

కాని పంతులుగారి మనసులో ఓ ఆలోచన మెరిసింది. రాత్రంతా ఒంటరిగా ఆలోచించాడు దాన్నిగురించి.

రాచకార్యాల రద్దీనిబట్టి, వారంరోజులలోగానే వచ్చి పదవి స్వీకరించవలసిందని కబురొచ్చింది పైనుంచి.

ప్రయాణం రేపనగా శాస్త్రిగారు పంతులుగారి గౌరవార్థం విందు చేశారు. ఉపన్యాసాలూ, ప్రశంసలూ ముగిశాక పంతులుగారు కృతజ్ఞత తెలిపారు.

"మరొక్క విషయం. చిరకాలంగా ఊళ్ళో రామమందిరం ఒకటి కట్టించాలని అనుకుంటున్నాను. వచ్చే రామనవమి నాటికి ముగిస్తానని ఆ మధ్య దండం పెట్టుకున్నాను. ఇపుడు ఈ విధంగా పొరుగూరు పోవాల్సి వచ్చింది. కాబట్టి ఆ భారం మీ అందరికీ ఒప్పగిస్తున్నాను. నిర్మాణానికి ఊరి శివారు మీద స్థలం ఇస్తున్నాను. ఊరు అటేపు పెరుగుతుంది. కాబట్టి అది బాగుంటుంది. పోతే కట్టడం ఖర్చులకు కాను పదివేలిస్తున్నాను. ఈ బాధ్యత అంతా తమ భుజాల మీద వేసుకుని నిర్వహించవలసిందిగా శ్రీ శాస్త్రిగారినీ, రెడ్డిగారినీ మీ అందరి తరఫునా నా తరఫునా కోరుతున్నాను. భగవంతుడి పని, కాదనరాదు" అంటూ శాస్త్రిగారి చేతులు పట్టుకున్నారు - పంతులుగారు.

హర్షధ్వానాలతో హాలు మారుమోగిపోయింది. పంతులుగారు హఠాత్తుగా చేసిన ఈ ప్రకటన విన్న శాస్త్రిగారికి ఏమనేందుకు తోచలేదు. వందనం చేసి, "మీ మాట శిరసావహిస్తాము" అని మాత్రం అన్నారు.

రెడ్డిగారు మాత్రం ఉత్సాహంగా లేచి కృతజ్ఞత ప్రకటించి, పంతులుగారి ఔదార్యాన్ని కొనియాడారు.

ఆ రాత్రి శాస్త్రిగారి సావిడిలో ఆయన బలగం అంతా పంతులుగారి మీద జాలిపడ్డారు.

"వెర్రిబాగులవాడు సెక్రటరీ పదవి ఇప్పించినందుకు పొంగిపోయాడు. ఆ కృతజ్ఞత కొద్దీ మనకీ గౌరవం చేశాడు. పాపం" అన్నారు శాస్త్రిగారు తృప్తిగా.

"కరణీ కులంలో తప్పబుట్టాడు" అన్నాడు రెడ్డిగారు. అందరికీ పంతులుగారి మీద హఠాత్తుగా గౌరవాభిమానాలు ఇనుమడించాయి.

మర్నాడు వీడ్కోలు బ్రహ్మాండమైన సంరంభంతో సాగింది. శాస్త్రిగారు రైలు మీద కొంతదూరం సాగనంపారు. పంతులుగారు ఛైర్మన్‌గిరీ రాజీనామా ఇచ్చినందువల్ల, ఎలక్షను లోపల పెద్ద పెద్ద నిర్ణయాలు చేసే అవసరం లేనందువల్ల. ఆ కొద్దిరోజులూ వ్యవహారాలు కమీషనరు చేతి మీదుగా జరపాలని నిశ్చయించబడింది. "ఎన్నికల్లో మీరు వచ్చి ప్రచారం చేసి పెట్టాలి. తీరిక చేసుకుంటారుగా" అన్నాడు శాస్త్రిగారు పెళ్ళికొడుకులా సిగ్గుపడుతూ. రెండునెలలు తిరిగేసరికి శాస్త్రిగారికి హఠాత్తుగా జ్ఞానోదయమైంది. పంతులుగారి విరాళం అంతర్యం స్ఫురించినట్టయింది.

"మీ దుంపతెగ" అనుకున్నాడు.

ఆ రెండు నెలల్లో చాలా కథ జరిగింది. పంతులుగారి విరాళం పెద్దదైనందువల్ల ఓ చిన్న కమిటీ వేయవలసి వచ్చింది - ఊళ్ళో గిట్టనివాళ్ళ దెప్పుళ్ళకు జంకి. కమిటీ అనగానే అభిప్రాయభేదాలు - "ఇదేం సర్కారు సొమ్ము కాదు. మునిసిపాలిటీ సొమ్ముకాదు, ఆఖరుకు బ్లాకుడెవలప్‌మెంటు బాపతేనా కాదు. ప్రయివేటు విరాళం. మనం అనవసరంగా భయపడడం మన చిత్తశుద్ధినీ, నిజాయితీని మనమే అనుమానించుకొనడం అవుతుంది. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో ధైర్యంగా వ్యవహరిద్దాం" అన్న ఉపన్యాసం చదివాడు ఒక సభ్యుడు. "అసలు రామమందిరాలు ఇప్పుడు ఫాషనుగాదు. శివాలయం వేదాం" అన్నాడొకాయన. మరే, పూర్వం అక్కడ శివలింగం వెలసిందని చెపుతారు అన్నాడు మరొకాయన. అది అమ్మవారు విహారం చేసే చోటు. ముత్యాలమ్మ కోవెల కడదామన్నా డింకొకాయన. దీనిమీద కొంత

చర్చ జరిగాక ఈ స్థలం రామమందిరానికి పనికిరాదని తేలింది.

మరేం చెయ్యాలి?

"మీరు కోపం తెచ్చుకోనంటే సభవారి తరపున ఒక ప్రార్థన చేస్తాను" అన్నాడు డిటోరావు ధైర్యం తెచ్చుకుని. అతను కమిటీలో మెంబరుకాడు. కాని శాస్త్రిగారి వెనక కుర్చీలో కూర్చున్నాడు.

"ఇది పవిత్ర కార్యం. రామమందిరం – లేక శివాలయం – బై ముత్యాలమ్మ గుడి నిర్మించకపోతే పంతులుగారి ఆత్మ శాంతించదు. ఆయన ఇచ్చిన స్థలం మంచిది కాదు కాబట్టి – మళ్ళీ వారిని శ్రమపెట్టడం భావ్యం కాదు కాబట్టి – మనమే సర్దుకోవాలి. ఊరికి దక్షిణపు హద్దులో శాస్త్రిగారి స్థలం నెం.2373/23–సి ఉంది. ఈ స్థలం కోవెలకు బాగుంటుంది. కొంచెం ప్రియమైనా, ఏదో ఒక ధరకు శాస్త్రిగారు దాన్ని కమిటీకే అమ్మేసెయ్యాలి. పంతులుగారిచ్చిన స్థలాన్ని కమిటీ తరపున ఆయనకే అమ్మేసెయ్యెచ్చు."

శాస్త్రిగారు డిటోరావు సలహా విని తలతాటించి లేచి గొంతు సవరించుకొని "తప్పయ్యా, అలా బతికున్న వాళ్ళ గురించి మాటాడినప్పుడు ఆత్మశాంతికి అనకూడదు" అని సుతారంగా డిటోరావును మందలించాడు. నువ్వు నన్నిలా ఇరకాటంలో పెట్టడం న్యాయం కాదన్నాడు. సభ వారందరి మొహాలూ పరిశీలనగా చూసి తక్షణం నాన్పుడు మానేసి, "సరే ఈశ్వర ప్రీత్యర్థం ఒప్పుకుంటున్నాను" అన్నాడు. మూడు రోజుల తరువాత, పంతులుగారి స్థలాన్ని కమిటీ నుండి గజం ముప్పావలా చేసికొని, కొనేసి తన స్థలం – డిటో రావన్నట్లు ప్రియమైనా, గజం అయిదు రూపాయల్నించి మూడు రూపాయలకు తగ్గించి అమ్మేశాడు.

అందువల్ల వారం రోజుల తరువాత నిర్మాణం ఆరంభించవలసి వచ్చినప్పుడు పనులను కొన్ని శాఖలుగా విడదీసి ఆలయం గోడలు కట్టే మంత్రిత్వ శాఖ ఒకరికీ, పునాదిరాళ్ళ శాఖ మరొకరికీ, టాపులేపే శాఖ మరొకరికీ, లోపల విగ్రహ ప్రతిష్ఠాపన శాఖ ఇంకొకరికీ ఇచ్చాడు. శంకుస్థాపన రాయి పోర్టుఫోలియో లాంఛనంగా తను ఉంచుకున్నాడు.

తరువాత కథ చకచక పరుగెత్తింది. చూసి తెలుసుకుని చెప్పడానికి వీల్లేనంత వేగంగా, గుట్టుగా, గుంభనగా వెళ్ళింది.

అన్నేళ్లు పడుతుందనుకున్న ఆలయ నిర్మాణం అందరికీ తలో శాఖ పంచినందువల్ల – ఎవరి పని వారు త్వరగా సాగించినందువల్ల – ఐదు వారాలలో పూర్తయిపోయింది.

శాస్త్రిగారు ఏదో ప్రయివేటు పనిమీద ఫ్యాక్టరీ లైసెన్సు కోసం ఢిల్లీ వెళ్ళి నాలుగు వారాల్లో తిరిగి వచ్చేసరికి అయిపోయిందన్నారు.

"ఏవిటయిపోయింది? డబ్బా?"

"అబ్బే.... అదే రెండూను. బడ్జెట్టు మేరకు గుడి కట్టేశాం" అన్నాడు డిటోరావు.

"శంకుస్థాపన రాయో?"

"మీరు చేయించింది చాలలేదు. పేర్లు ఎక్కువయ్యాయి. ఇంకో పెద్దది తెచ్చి దీనికి అతికారు."

"ఎవణ్ణడిగి చేశారు? ఇవాళ కమిటీ మీటింగని చెప్పి నలుగుర్నీ కేకేసుకురా."

"ఇంకా కమిటీ ఏదండి? కట్టడం అయిపోయింది గదా అని కమిటీ రద్దుచేస్తూ ఏకగ్రీవంగా రిజల్యూషను చేశాంగా"

"చేశావేమిటి? నువ్వూ చేరావా?"

"మీ తరపున నన్ను ఛైర్మనుగా ఉండమని దేవుళ్ళాడారు"

"డొక్క చింపేస్తా. నే లేకుండా ఏమిటిదంతా... పేర్లు...."

"మీ పేరు వేశారండి శంకురాయి మీద. పంతులుగారి అసలు పేరు మర్చిపోయాం. తరవాత కిందను ఒక దాత దానం అని చెక్కించాం లెండి. మీర్రావడమే ఆలస్యం, ప్రారంభోత్సవం, దేవుడిని ప్రతిష్టించడం అన్నీ ఈ వారంలోగా ముగించవచ్చు. పైనెల ఎలక్షన్లు కదా" అన్నాడు డిటోరావు.

శాస్త్రిగారు జుట్టు పీక్కోబోయి, బజారు కెళ్ళాలి గదా అని మానేసి, వెంటనే బయలుదేరి ఆలయం దగ్గరకు వెళ్ళాడు.

"కొంపదీసి ఆలయానికి పేరు కూడా పెట్టేశారా?" అన్నాడు దారిలో.

"లేదండి. ఏ దేవుడో తేలలేదు గదా? పట్టాలు మాత్రం ముగ్గురివీ చేయించేశారు పద్మనాభయ్యగారు. చాలా బాగున్నాయండి. ఒక్కోటి ఐదొందల్ల - మనం ఏది కావాలంటే అది పెట్టుకోవచ్చు. మిగతా రెండూ మీకిచ్చేస్తారు కావాలంటే."

దారిలో జనం అంతా తనకేసి వింతగా చూస్తున్నట్టనిపించింది శాస్త్రిగారికి.

ఆలయ స్థలం దగ్గర చుట్టూరా నిలువున్నర ఎత్తున తారుపూసిన తడకలూ, రేకులూ, దడి కట్టి ఉన్నాయి. గుమ్మం దగ్గర ఎవరో కాపలా ఉన్నారు. లోపలికి వెళ్ళడానికి వీల్లేదన్నాడు.

"రహస్యంగా ఉంచాలని ఈ కట్టుదిట్టం చేశాం. కంట్రాక్టరుగారు చవగ్గా కొనేస్తాడులెండి" అంటూ లోపలికి దారితీశాడు డిటోరావు.

"ఏదీ కోవెలేదీ?" అన్నాడు శాస్త్రిగారు నిర్ఘాంతపోయి. ఆత్మప్రదక్షిణ చేసి నలుదిశలా చూశాడు. ఎక్కడా ఏమీ కనపడలేదు. "కిందికి చూడండి" అన్నాడు డిటోరావు ముసిముసి నవ్వులు నవ్వుతూ.

☆ ☆ ☆

"గోపన్నా, అదీ కథ! కమిటీలో సభ్యులు ఉన్న డబ్బును పనుల ప్రకారం కేటాయించారు. నేలమంత్రి నేల బాగుచేయించాడు. గోడమంత్రి గోడ లేపాడు. ఎంత మట్టీ ఇటుక ముక్కలూ కలబోసినా రెండడుగుల ఎత్తు కట్టేసరికీ డబ్బు అయిపోయినందువల్ల ఆయన ఆపేశాడు. టాపులేపే ఆయన ఇంకా ఆలస్యం అయితే ఇప్పటికే పెరిగిన ధరలు మరీ పెరిగిపోతాయని దూరాం ఆలోచించి ఉన్నంతలో దొరికినంత మంచి రేకులు సంపాదించి మందిరానికి మూత వేశాడు. ముందర మాత్రం రెండడుగుల ఎత్తున, పన్నెండడుగుల బారున శంకుస్థాపన ఫలకం నల్ల చలువరాతిది - తళతళ మెరిసిపోతూంది, దాని పక్కనే బుల్లి సింహద్వారం, మరోపక్కన రెండు కిటికీలూ అమర్చాడు, కలప సభ్యుడు. రెండో కిటికీ పూర్తి చెయ్యటానికి ఆయన చేతిది కొంత పెట్టాల్సొచ్చిందిట కూడా.

శాస్త్రిగారు గొల్లుమన్నారు. ప్రాణం చాలొచ్చింది. అలాగే కుప్ప కూలిపోయాడు.

ఆ రాత్రి తిండీ తిప్పలూ లేవు. తెల్లవారితే ప్రజలకు మొహం ఎలా చూపటం? ఈ పొట్టిగుడిని ఎలా సమర్థించడం? పంతులుగారికేం చెప్పడం? రేపు మినిస్టరుగారు ప్రారంభోత్సవానికొస్తే, ఆయన నెలా లోపలి కెళ్తాడు? ఆయనకేం పాలుపోలేదు.

పంతులుగారు తన మీద పగ సాధించడానికే ఈ విరాళం ఇచ్చి పెద్దరికం తనకంట గట్టాడేమో... ఎంత పెద్ద ఎత్తు? రాక్షసి ముండాకొడుకు. తిట్లు తరువాత ఆలోచించవచ్చు. ఇది ఆయన వేసిన ఎత్తు అయితే – లేదా తన ఎత్తుకు పైఎత్తు అయితే ఇపుడు తను దానికి పై ఎత్తు వెయ్యాలి.... ఏం చెయ్యాలి? ఈ మరుగుజ్జ దేవళాన్ని ఎలా నిలబెట్టాలి? ఎలా ఎత్తుచెయ్యాలి? లేదా వెయ్యాలి? చాణుక్యుడేం చేసేవాడు? రాక్షసుడెలా ఆలోచించేవాడు? మేకియవిల్లీ ఏం సలహా చెబుతాడు? ఇలాంటి పన్లకు వాళ్ళ పేర్లు లాగడమెందుకు? దీనికి అంతటి బుర్ర లక్కరలేదు. అబ్బే ఆ బుర్రల్చాలవు... పోతే పోయింది, మహా అయితే అప్రతిష్ట వస్తుంది. వెధవ ప్రజల కిలాంటి వెన్నాళ్ళు జ్ఞాపకం ఉంటాయి గనక. మళ్ళీ ఎల్లక్షన్నాటికి వాళ్ళే మరిచిపోతారు. మహా అయితే రేపు పంతులొస్తే శివమెత్తినట్టు ఆడిపోతాడు.... మరే, శివమెత్తినట్టు ఆడిపోతాడు.

☆ ☆ ☆

మర్నాడు సాయంత్రానికి ఊళ్ళో మడేలు వీరన్నకూ, అంతా మరచిపోయిన గణాచారికీ, డిటోరావు రెండో పెళ్ళానికీ, ఆ మర్నాడు శ్రేష్టిగారికీ, సాయంత్రం కాంట్రాక్టరుగారి అత్తగారికి శివాలెత్తాయి. ఇద్దరు ముగ్గురికి కలలొచ్చాయి. అందరూ ఒకటే మాట. ఈ దేవళం అమ్మవారి కంకితం కావాలని, ఇంతకన్న ఎత్తుగా పెంచకూడదని. కలియుగ మానవులకు గర్వం, అహంకారం బలిసినందువల్ల ఈ విధంగా లోకమాత ఎదట నడ్డి వంచి కాళ్ళా చేతులా పాకి గుడి లోపలికి వెళ్లి దేవతను కొలవాలనీ, అందుకే ఆలయం ఇంత పొట్టిగా ఉండాలనీ... అందరూ శివాలెత్తినట్టు చెప్పాడు.

ఈలోగా శాస్త్రిగారు రేకులు పీకించి గోడ లెత్తు చేయించడానికి పూనుకున్నాడు. అది అపచారమనీ, ఆ పని వెంటనే ఆపించాలనీ పూనకాలు చూసిన కంట్రాక్టరుగారు అన్నారు. కొందరు పరుగులూ ఉరకలూ వేసి వెళ్ళి పని ఆపించెయ్యమన్నారు. తక్షణం ఆ మాట శిరసావహించి శాస్త్రిగారు పూనకం వచ్చిన మనిషి దగ్గరకెళ్ళాడు, పెద్దమనుషుల్ని వెంటేసుకుని. సత్యం పలికింది అమ్మవారు.

ఆ విధంగా దేవళం పొట్టిగానే ఉంచాలని పెద్దలు నిశ్చయించారు. బాజాభజంత్రీలతో బ్రహ్మాండమైన పూజలతో ఆలయం ఆరంభమైంది. కొద్దిరోజుల్లోనే అద్భుతమైన మహాత్యాలు కనబడ్డాయి. బోలెడన్ని దాఖలాలు కనపడ్డాయి.

శాస్త్రిగారు నడుం కట్టి దగ్గరుండి నడిపించారు కొన్నాళ్ళు. దుకాణాలకు జోరుగా లైసెన్సు లిప్పించారు. వేలాదిగా జనం రాసాగారు, కొత్తలోనే ఒకరిద్దరు మంత్రులూ, ఇద్దరు ముగ్గురు సినిమా తారలూ అర్చనకు వచ్చారు. ఆ సందర్భంలోనే వి.ఐ.పి.లు పాకవలసిన అవసరం లేకుండా నిలువు లోతున సొరంగం వేయించడం జరిగింది.

☆ ☆ ☆

ఈ భోగట్టా కర్ణాకర్ణిగా విని ఉన్నపళంగా పరుగెత్తుకు వచ్చారు పంతులుగారు. చూసినది చూసినా నమ్మశక్యం కాకుండా ఉంది.

"దేవాంతకుడా!" అన్నాడు శాస్త్రిని చాటుకు పిలిచి.

"అంతా మీ చలవ. ఎలక్షనొచ్చింది. ఏం చెయ్యను? మీర్రాకుండానే ప్రారంభోత్సవం జరపాల్సొచ్చింది. రోజు రోజుకూ నిదర్శనలూ ఎక్కువై పోసాగాయి. మహా సత్యమైన దేవతలెండి" అన్నాడు శాస్త్రిగారు విలాసంగా నవ్వి.

పంతులుగారు గుడ్లనీరు గక్కుకున్నారు. "శాస్తుర్లూ మహా పాపం సుమీ. దైవకార్యం అని మరచిపోయావు. మీకు ఆ డబ్బు కలసిరాదు" అన్నారు పంతులుగారు గద్గద స్వరంతో.

శాస్త్రిగారు కోపం అభినయించారు.

"అయ్యా, మీరు కాస్త నిదానించి మరీ మాట్లాడాలి. పూరీ జగన్నాథంలో బొమ్మలు చెక్కించింది రాజాగారు కాబట్టి అబోరు దక్కింది. అదే నేనూ మా కంట్రాక్టరూ అయితే బొమ్మలు సగం చెక్కించి డబ్బు తినేశామనే వారే... ఇంకా నయం... కావలిస్తే మీ డబ్బుకు పద్దులు చూపిస్తాం రండి" అన్నారు.

పంతులుగారు తల వంచుకు వెళ్ళిపోయారు.

☆ ☆ ☆

ఇలాటి వాళ్ళ చేతిలో పురపాలన పెడితే ఈ మునిసిపాలిటీ ముక్కలై పధ్నాలుగు పంచాయితీ లయిపోతుంది అని భయం వేసింది పంతులుగారికి. ఏమైనా సరే తనూ ఎన్నికలకు నిలబడాలని తీర్మానించుకున్నాడు. నిర్మొహమాటంగా పార్టీ సెక్రటరీ పదవికీ, సభ్యత్వానికీ రాజీనామాలు పెట్టేసి మునిసిపల్ ఎలక్షనుకు స్వతంత్రుడిగా ఓ కాయితం పడేశాడు.

దేవళం అసలు కథ గురించి అంతా వెల్లడిస్తానంటూ ప్రచారం ఆరంభించాడు.

"ఆయన గెలుస్తాడంటావా? గోపన్నా" అని మణిసిద్ధుడు కథ ముగించాడు.

"సుబ్బరాజా! ఆ వెర్రి గొల్లపిల్లాడేం చెబుతాడుగాని నువ్వు జెప్పు చూతాం. ఆ ఎలక్షన్‌లో పంతులు గెలవగలడా? ప్రజల డబ్బు పాడవకుండా చూడాలన్న ఆశ ఉంది కాబట్టి ఆయనకు ఓటివ్వడం సబబైనా ఆయనకు ఓట్లు పడతాయా? నువ్వు పౌరుడివైతే ఎవరి కేస్తావ్?" అన్నారు రామిరెడ్డిగారు కథ ముగించి.

"శాస్త్రిగారికే వేస్తాను. పంతులుకు ఓటు వేసినా ఆయన గెలిచినా అట్టే కాలం నిలబడలేడు. ఎలాగా శాస్త్రి మళ్ళీ వస్తాడు. బై ఎలక్షన్ పేరు జెప్పి, ఇంకాస్త డబ్బు దండుగ. పంతులుకు రాజకీయ వ్యూహాలు ఎత్తుకు పై ఎత్తులు చేతగావు. ఆయన వేసిన 'విరాళం ఎత్తు' చూట్టానికి బాగున్నా వెర్రిబాగుల పద్ధతి.

శాస్త్రిలాంటి వాడి ముందు, అలాంటివాడు ఆటిరాడు. గవర్నమెంటు నాలు క్కాలాలు నిలిపి, నడపలేని మంచివాడికన్నా, ఎత్తుకు పైయెత్తు వేస్తూ పవరులో నిలబడే చెడ్డవాడే మెరుగు... పంతులుగారు నరాంతకుడు, శాస్త్రి దేవాంతకుడు, నా ఓటు శాస్త్రికే" అన్నాడు సుబ్బరాజు.

★ ★ ★